క్లుప్తంగా

17న రౌండ్ టేబుల్ సమావేశం



కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో 'సామాజిక న్యాయం – జగనన్నతోనే సాధ్యం' అంశంపై ఈనెల 17న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం స్థానిక బీసీ భవన్‌లో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బీసీ నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్యతో కలిసి విడుదల చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గౌతమ్, విద్యాసాగర్, ఆరెకటికె కార్పొరేషన్ డైరెక్టర్ శివ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 వాహనాలు స్వాధీనం



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద గురువారం రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ అనలైజర్ ద్వారా పరిశీలించారు. మద్యం తాగి కారు నడుపుతున్న వ్యక్తితో పాటు మరో 25 ద్విచక్ర వాహనదారులను అదుపులోకి తీసుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

వృద్ధుడి దుర్మరణం



మృతిచెందిన వెంకటరాముడు

కర్నూలు: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామానికి చెందిన దాసరి వెంకటరాముడు (89) దుర్మరణం చెందాడు. ఈయనకు భార్య రంగమ్మతో పాటు ఇద్దరు కొడుకులు, కూతుళ్లు ఉన్నారు. కుమారులు కర్నూలులో ఉంటున్నారు. వారి కోసం కర్నూలుకు వచ్చిన వెంకటరాముడు బళ్లారి చౌరస్తా సమీపంలోని యమహా షోరూమ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఎమ్మిగనూరు నుంచి గూడూరు మీదుగా కర్నూలుకు వస్తున్న కర్నూలు-1 డిపో బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులతో గిడ్డయ్య

కర్నూలు(రూరల్): శ్రీకాకుళంలో ఈనెల 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులకు ఉషూ సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు గిడ్డయ్య క్రీడా దుస్తులను గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచి పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శిక్షకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి



ఫ్లో మీటర్‌ను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు

కర్నూలు (న్యూసిటీ): స్థానిక సంతోష్ నగర్‌లోని మేరు ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లారీల వర్క్‌షాప్‌ను తూనికలు, కొలత శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు గురువారం తనిఖీ చేశారు. లీగల్ మెట్రాలజీ శాఖ ముద్ర లేకుండా బీఎస్6 వాహనాలకు యాడ్ బ్లూ ఆయిల్ ఉపయోగిస్తున్న రెండు ఫ్లో మీటర్లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. ఎవరైనా అనుమతి, ముద్ర లేకుండా ఫ్లో మీటర్లు వాడితే షాప్‌ల సర్టిఫికెట్లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సమ్మిట్‌కు డాక్టర్ వినూషారెడ్డి

కర్నూలు కల్చరల్: దక్షిణాఫ్రికాలోని జోహెన్స్‌బర్గ్‌లో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌లో జిల్లాకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వినూషారెడ్డి పాల్గొననున్నారు. బ్రిక్స్ పొలిటికల్ పార్టీస్ ప్లస్ డైలాగ్ డెలిగేషన్‌లో పాల్గొనే నలుగురు సభ్యుల బీజేపీ బృందంలో ఈమె ఒకరు. బీజేపీ బృందానికి తమిళనాడు బీజేపీ అధ్యక్షులు కె.అన్నామలై నేతృత్వం వహించనున్నారు. సౌత్‌ఆఫ్రికాలోని ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 18న జరగనున్న సమ్మిట్‌లో వైద్యంతో పాటు మానవ వనరుల అభివృద్ధి, పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశంపై వినూషారెడ్డి ప్రసంగించనున్నారు.



సీఎంను కలిసిన కార్పొరేటర్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కర్నూలు కార్పొరేటర్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో కలిశారు. గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు జుబైర్ అహ్మద్, యూనుస్ బాషా, ఫారజ్ ఖాన్, పార్టీ నాయకులు ఖాదర్ బాషా, రియాజ్ బాబా, మహిళా నాయకురాలు సఫియా ఖాతూన్ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రంలో మంత్రి అంజాద్ బాషా, ఎంపీ డాక్టర్ సంజీవకుమార్ - కర్నూలు(రాజ్‌విహార్)

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆమె మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లతో హౌసింగ్, ఉపాధి హామీ పథకం అమలు, ప్రాధాన్యత భవనాల పురోగతి, జగనన్న సురక్ష, విద్యాశాఖ అంశాలపై టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బేస్‌మెంట్ లెవల్ నుంచి కంప్లీషన్ స్థాయి స్టేజ్ కన్వర్షన్ పనుల్లో పురోగతి నెమ్మదిగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా వారంలో ప్రతి మండలంలో కనీసం 100 ఇళ్లను పూర్తి చేయాలని ఉన్నా.. లక్ష్యం నెరవేరడంలేదన్నారు. ఆప్షన్-3 కింద నిర్మిస్తున్న వాటిలో ఆదోని తప్ప మిగతా మండలాల్లో పురోగతి తక్కువగా ఉందని, మిగిలిన మండలాలు పురోగతిపై దృష్టి సారించాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణను ఆదేశించారు. వచ్చే సోమవారానికి స్టేజ్ కన్వర్షన్‌లో పురోగతి లేని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులను కల్పించాలని ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించి బ్లూఫ్రాగ్ యాప్‌లో ఫిట్టింగ్ అప్‌డేషన్ చేయడంలో కల్లూరు మండలం తక్కువ శాతంలో ఉందని, పురోగతి సాధించేలా చూడాలని ఆదేశించారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికుల హాజరును తీసుకోవడంలో అన్ని మండలాలు 75 శాతం కంటే ఎక్కువగా ఉంటే కృష్ణగిరి మండలం మాత్రం కేవలం 40 శాతం నమోదు చేయడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష పథకంలో వలంటీర్ యాప్‌లో హౌస్‌హోల్డ్ సర్వే చేయిండచంలో హొళగుంద, సి.బెళగల్, గూడూరు, కర్నూలు అర్బన్, ఆస్పరి, కౌతాళం, తుగ్గలి, వెల్దుర్తి మండలాలు తక్కువ శాతాన్ని నమోదు చేశాయని, యాప్ క్లోజ్ అవ్వకముందే వలంటీర్లతో సర్వే చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రాధాన్యత భవాలను సెప్టెంబర్ ఆఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 5–18 ఏళ్ల మధ్య ఉండే పిల్లలను గుర్తించే సర్వే యాప్‌లో టెక్నికల్ సమస్యతో 98 శాతం నుంచి 77 శాతానికి జిల్లా పడిపోయిందని సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్ కలెక్టర్‌కు వివరించారు. సిస్టమ్, స్కూల్ డ్రాపవుట్స్ పిల్లలు ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, కల్లూరులో ఎక్కువగా ఉన్నారని, ప్రణాళిక ప్రకారం వారిని గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

నూతన కేథలాబ్ మిషన్ ఏర్పాటుకు చర్యలు



కేథలాబ్ మిషన్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కార్డియాలజీలో ఉన్న పాత కేథలాబ్ మిషన్‌ను తొలగించి, దాని స్థానంలో కొత్త మిషన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, కార్డియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పి.చంద్రశేఖర్, అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ రమేష్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రాజగోపాల్‌రెడ్డితో కలిసి కేథలాబ్ మిషన్ ఏర్పాటు తదితర పనులను పరిశీలించారు.

బియ్యం వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన బియ్యంను గురువారం వేలం వేసినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యంకు వేలం పాట నిర్వహించగా 21 మంది పాటదారులు పాల్గొన్నారు. మిశ్రమ బియ్యాన్ని కేజీ రూ.45 చొప్పున కర్నూలుకు చెందిన ఈ.రామానంద్ హెచ్చు పాడారన్నారు. అలాగే లావు బియ్యం కేజీ రూ.28 చొప్పున బనగానపల్లెకు చెందిన జీత్ కుమార్ హెచ్చు పాడి దక్కించుకున్నట్లు వెల్లడించారు. పర్యవేక్షణ అధికారి రామాంజినేయశర్మ, గ్రామ పెద్దలు కృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ..

కోసిగి: మండలంలోని గౌడుగల్లు గ్రామంలో పొలం రస్తా విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం గ్రామంలో పొలం రస్తా పేరుతో పాత కక్షలు మనుస్సులో పెట్టుకుని దావీద్, కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన ఉరుకుందప్పతో పాటు మరో ఐదుగురు దాడి చేశారు. దీంతో దావీద్‌తో పాటు మరొకరి తలకు గాయాలు కావడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోనికి తరలించారు. బాధితులు కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి



సంక్షేమ భవన్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు కోరారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక సంక్షేమభవన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్రబాబు మాట్లాడుతూ అనేక వసతి గృహాల్లోని విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, సన్న బియ్యం సరఫరా చేసి మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని కోరారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు జె.రంగలక్ష్మిదేవికి వినతి పత్రం అందించారు. ధర్నాలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, నగర నాయకులు గోవర్ధన్, శేఖర్, నాగరాజు, ముని, ధను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు (టౌన్): పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు, ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ కార్మికులకు రెండు నెలలుగా మెడికల్ అలవెన్స్, అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. యూనిఫామ్‌ను రెగ్యులర్‌తో పాటు ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఇవ్వాలని కోరారు. కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, స్టిచ్చింగ్ చార్జీలు ఇవ్వాలన్నారు. అనంతరం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, చంద్రశేఖర్, జాన్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కామిక ఏకాదశి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు,(ఇన్‌సెట్)ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో గురువారం కామిక ఏకాదశి పూజలు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహారాజ భోగను నైవేద్యంగా సమర్పించారు. కామిక ఏకాదశి మహత్యంపై ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభువు వివరించారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం నిర్వహించారు.

జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): వక్ఫ్‌బోర్డు జోనల్ కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలని వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మహమూద్ పీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమలో వక్ఫ్ ఆస్తులు అధికంగా ఉన్న నేపథ్యంలో వీటిని కాపాడేందుకు జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరిగే బోర్డు ఎన్నికల కోసం అర్హులందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు.

హాస్టల్ విద్యార్థులపై వార్డెన్ నిర్లక్ష్యం

కర్నూలు(అర్బన్): ఓర్వకల్లు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారి విద్యార్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములుగౌడ్ గురువారం ఆ శాఖ సంయుక్త సంచాలకులు జె.రంగలక్ష్మిదేవిని కలిసి వినతి పత్రం అందించారు. విద్యార్థుల బాగోగులు పట్టించుకోకపోవడంతోపాటు వసతి గృహంలో అంతర్గత వ్యక్తులను నియమించుకుని విద్యార్థులపై దాడులు చేయిస్తున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలపై దాడి

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో పొలం తగాదాలో ఇద్దరు మహిళలపై ప్రత్యర్థి వర్గం వారు దాడికి తెగబడ్డారు. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంజమ్మ, సుంకులమ్మ గురువారం పొలంలో పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మునీశ్వరి, రోజా రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరు కర్రలతో దాడి చేశారు. ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీమ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

కర్నూలు సిటీ: రాయలసీమ ప్రాంత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు చేస్తామని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు తెలిపారు. గురువారం నగరంలోని ఓ కాలేజీలో ఆర్‌వీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దామోదరం నాగన్న, నాయకులు బాలరాజు, సురేంద్ర, ప్రకాష్, తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఈ-కార్డులతో ప్రభుత్వ పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలు పొందేందుకు ఈ-శ్రామ్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని కార్మిక శాఖ సహాయాధికారి కేశన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని పొందవచ్చని పేర్కొన్నారు.

బిల్లుల వసూలుపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించిన యూనిట్లకు సంబంధించి స్పాట్ బిల్లింగ్ ద్వారా డిమాండ్ నోటీసులు జారీ చేశామన్నారు. దీంతో బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. నిర్ణీత లక్ష్యాన్ని చేరాలంటే ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని ముందుకెళ్లాలన్నారు. పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలయ్యేలా చూడాలని సూచించారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

కర్నూలు కల్చరల్: అర్చకులకు వంశపారం పర్య హక్కులు, జీతాల పెంపు, వయోపరిమితి పెంపుపై ఏపీ ప్రభుత్వ కేబినెట్ బుధవారం తీర్మానం చేసింది. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ అర్చక వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పూజారి వెంకట సాయినాథ్, ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్, రాష్ట్ర ఉప కార్యదర్శి కంచుగంటల శ్యాంసుందర్‌రావు తదితరులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ఇంటి వద్దకే వచ్చి పథకం మంజూరు చేసి..



అమ్మ ఒడి పథకానికి లబ్ధిదారు నుంచి బోటన వేలు ముద్ర తీసుకుంటున్న వలంటీర్ తిరుపాల్

నగరంలోని గణేష్ నగర్ –2 కాలనీలో నివసించే జి.రామతులసీకి ఇద్దరు పిల్లలున్నారు. భర్త చిరుద్యోగి. ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాల గురించి పెద్దగా తెలియదు. ఇదే ఏరియాలో ఉన్న వలంటీర్ తిరుపాల్ రామతులసి ఇంటికి వెళ్లి అమ్మ ఒడి పథకం గురించి వివరించారు. పిల్లలను స్కూల్‌కు పంపితే ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తుందని చెప్పాడు. తెల్లరేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఆమె పాస్ ఫొటో, బొటన వేలి ముద్ర, బ్యాంకు అకౌంట్ నంబర్ తీసుకుని దరఖాస్తు చేయించాడు. అంతే ఆమె ఖాతాలో అమ్మ ఒడి డబ్బు పడింది. పిల్లల చదువులకు జగనన్న అమ్మ ఒడి డబ్బు రావడంతో ఆ మహిళ హర్షం వ్యక్తం చేస్తోంది.

పిల్లల చదువుపై ఆందోళన లేదు

ఆర్థికంగా నిత్యం ఇబ్బందులు పడే కుటుంబం మాది. ఈ పథకం గురించి తెలియదు. వలంటీర్ తిరుపాల్ మా ఇంటికి వచ్చి పథకం గురించి చెప్పి ప్రభుత్వం ఇచ్చే అమ్మ ఒడి డబ్బు వచ్చే విధంగా చేశాడు. అసలు ఎక్కడకూ వెళ్లలేదు. ఇంటికి వచ్చి ఆర్థికంగా తమ కుటుంబానికి భరోసా ఇచ్చాడు. ఇంత మంచి పనులు చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. వలంటీర్ సేవలు మరిచిపోలేం.

– జి. రామతులసీ (అమ్మ ఒడి లబ్ధిదారు)

పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్

కర్నూలు(రూరల్): మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తూ బీపీడీ పూర్తి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని మున్సిపల్ స్కూల్స్ పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుధీర్ కోరారు. గురువారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్‌లో పదోన్నతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ స్కూల్స్‌లో విద్యార్థులకు అనుగుణంగా వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి మున్సిపల్ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కర్నూలు(రూరల్): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. నగరంలోని కేకే భవనంలో ఏర్పాటు చేసిన మీటర్ రీడర్స్ యూనియన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో మీటర్ రీడర్స్ జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. గతంలో 15 రోజులు పని చేసుకునే వెసులుబాటును 9 రోజులకు కుదించడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పీస్ రేట్ రద్దు చేసి కనీస వేతనం ఇచ్చి 30 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు రామకృష్ణ, ఉరుకుందు, రోగెన్న, సుధాకర్, నరసింహులు, కిరణ్ కుమార్, కుమార స్వామి, భీమేష్, లతీఫ్, చక్రవర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కర్నూలు(రూరల్): ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గుడిసె కాలిపోయి నిరాశ్రయురాలైన సోమిశెట్టి నగర్ చాకలి సత్యవతికి గురువారం ఆటో యూనియన్ నాయకులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ న్యూసిటీ ఆటో యూనియన్ అధ్యక్షుడు నరసింహులు, యూనియన్ నాయకులు రాధాకృష్ణ,ప్రభాకర్,మాలిక్,నరసింహ,జయన్న పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తృతం చేయాలి



అంతర పంటలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే ప్రయోజనాలు, పథకం ఆవశ్యకతను గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత పరచాలని పథకం రీజనల్ కో-ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో జన్మభూమి గ్రామైక్య సంఘం సభ్యురాలు వీరభద్రబాయి, ఆమె భర్త సుగాలి వెంకటరమణకు చెందిన ఎకరా పొలంలో ప్రధాన పంటగా దేశీ పత్తి(నా బీటీ) రకంతో పాటు, 36 రకాల విత్తనాలను శుద్ధీకరణ చేసి అంతర పంటగా విత్తి, ఘన జీవామృతం వేశారు. పథకం కన్సల్టెంట్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కార్యక్రమానికి పథకం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజనల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ రైతులు అంతర పంటలను సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. పంటల వైవిధ్యం ఏర్పడడమేగాక, భూమిలో పోషక విలువలు పెరుగుతాయని సూచించారు. పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు కషాయాలు, ద్రావణాల తయారీపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏఈఓ భాస్కర్, ఎస్ఎఫ్ఏ అబ్దుల్‌బాషిద్, మాస్టర్ ట్రైనర్ ఆంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, శివ, లక్ష్మినారాయణ, రైతులు హుసేన్‌బాష,పాదుపుమహిళలు పాల్గొన్నారు.